



మంచు ముసురేసిన వేళ..

● 8 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

మెళియాపుట్టి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి)

సిక్కోలును మంచు కమ్మేస్తోంది. జిల్లాలో రెండు రోజులుగా విపరీతమైన మంచు కురుస్తుండడంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. చలి తీవ్రత పెరిగింది. మెళియాపుట్టి తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో 8 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. కొంతమంది చలితీవ్రతను తట్టుకునేందుకు అగ్గి మంటలు వేసి.. ఉపశమనం పొందుతున్నారు. అలాగే కొండల ప్రాంతాల్లో ఉదయం 10 గంటల వరకూ మంచు తెర వీడకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంచు కురుస్తున్నప్పుడు వృద్ధులు, చిన్నారులు బయటకు రావద్దని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.



అరసవల్లి సమీపంలో..



మెళియాపుట్టిలో ఉదయం 6 గంటల సమయంలో.. 8 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు



శ్రీకాకుళంలో కురుస్తున్న మంచు



మెళియాపుట్టిలో చలి మంట కాగుతున్న ప్రజలు



మంచు దుప్పటిలో మెళియాపుట్టి

నేడే.. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

● శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ మైదానంలో నిర్వహణ

● విజేతలకు భారీగా నగదు పురస్కారాలు

శ్రీకాకుళం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సమీపిస్తోంది. పండుగ నేపథ్యంలో ఏటా మాదిరి ఈ ఏడాదీ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీల నిర్వహణకు రంగం సన్నద్ధమైంది. "ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగెసెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)" సహకారం అందించనున్నాయి. మహిళలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని.. అందమైన ముగ్గులు వేసి.. ఆకర్షణీయమైన బహుమతులను గెలుచుకోవాలని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' పిలుపునిస్తోంది.

శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పోటీలు జరుగుతాయి. ఆకర్షణీయమైన మూడు ముగ్గులను న్యాయనిర్ణేతలు ఎంపిక చేసి విజేతలకు బహుమతులతో పాటు నగదు పురస్కారాన్ని అందజేస్తారు. ప్రథమ విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4వేలు, తృతీయ విజేతకు రూ.3 వేలతోపాటు మెమొంటోలను ఇస్తారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు కన్సొలేషన్ బహుమతులు కూడా అందజేస్తారు. శ్రీకాకుళంలో ముగ్గుల పోటీలకు.. స్పాన్సర్‌గా మీనాక్షి హాస్పిటల్ ప్రముఖ సర్జికల్ గ్రాస్ట్రో ఎంట్రాలజిస్ట్, లేపరోస్కోపిక్ సర్జన్ డా.గంగాధర్‌రావు గొండు, స్త్రీ ప్రసూతి వైద్యనిపుణులు, లేపరోస్కోపిక్ సర్జన్ డా.సీహెచ్ హరిత వ్యవహరిస్తున్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన విజేతను ఈ నెల 11న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఏకంగా రూ.1.50 లక్షల విలువగల బహుమతులను గెలుచుకోవచ్చు. ఆసక్తి గల మహిళలు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు 9985411526 నంబర్‌కు సంప్రదించవచ్చు.

యువత 'ఉన్నతి'కి..

● 31 రంగాల్లో.. 215 కోర్సుల్లో నైపుణ్య శిక్షణ
● వంద పని దినాలు పూర్తయిన కుటుంబాలకు ప్రాధాన్యం
● 90 రోజుల వేతన భృతితో అవకాశం
● నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగాలు

6లో



టైలరింగ్‌లో మహిళలకు శిక్షణ (ఫైల్)



శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలోని అద్దె దుకాణాలు

అద్దె వదిలేశారు!

● కార్పొరేషన్ ఆదాయానికి గండి
● భారీగా దుకాణాల బకాయిలు
● రూ.40లక్షలకు పైగా పెండింగ్
● నోటీసులతో సరిపెడుతున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పాలక సంస్థ ఆదాయ వనరుల్లో కీలకమైనవి దుకాణాల అద్దెలు. కానీ ఆశించిన స్థాయిలో ఇవి వసూలు కావడం లేదు. కార్పొరేషన్‌కు పన్నులు, అద్దెలు ప్రధాన ఆదాయ వనరులు. కానీ ఈ రెండింటి ద్వారా అందుతున్నది అంతంత మాత్రమే. కార్పొరేషన్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న భవనంలో 39 దుకాణాలు ఉన్నాయి. వీటికి మూడేళ్లకోసారి టెండర్లు నిర్వహించాలి. ప్రతి నెల అద్దె వసూలు చేయాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ఈ 39 దుకాణాల కోసం టెండర్లు నిర్వహించారు. వీటిలో ఆరు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 33 దుకాణాలకు టెండర్లు పూర్తయ్యాయి. ఒక్కో దుకాణం (మిగతా 6వ పేజీలో..)

బకాయిలు చెల్లించకపోతే సీజ్ చేస్తాం



అద్దె బకాయిలు చెల్లించకుంటే నగరపాలక సంస్థ పరిధిలోని దుకాణాలు సీజ్ చేస్తాం. ఇప్పటికే మూడు దుకాణాలకు సీలు వేశాం. బకాయి నోటీసులు కూడా పంపించాం. ఆర్‌ఐలకు దీనిపై ఆదేశాలు జారీ చేశాం.
- పి.వి.వి.ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం కార్పొరేషన్

నేస్తానికో నెయ్యి ముద్ద

● బంధాలకు చిహ్నంగా చెక్కీలు, ముద్దలు
● సంప్రదాయానికి ప్రతీకలు

6లో



సిగ్నల్ సమస్యతో నిలిచిన రైలు

8లో

సంతబొమ్మాళి వైపు.. హల్దియా చూపు!

● మూడువేల ఎకరాల్లో పెట్రో కెమికల్స్‌కు సన్నాహాలు
● భారీ స్థాయిలో పెట్టుబడికి ప్రతిపాదనలు

6లో

న్యూస్ బాక్స్

రథసప్తమి లోగో రూపకల్పనకు ఆహ్వానం

● అధికారులు ప్రణాళికతో హాజరు కావాలి
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రథసప్తమి పండుగను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించి లోగో రూపకల్పనకు ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. వేడుకలకు సంబంధించి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. లక్షలాది భక్తులు తరలివచ్చే ఈ వేడుకలకు.. పార్కింగ్, లేజర్ షో, దేవాలయాల నమూనా ప్రదర్శన, సీసీ కెమెరాలు, తాగునీటి సౌకర్యం, ప్రసాదాల కౌంటర్లు, రవాణా, వసతి సౌకర్యాలపై చర్చించారు. వచ్చే వారం నిర్వహించే సమీక్ష సమావేశానికి అధికారులంతా ప్రణాళికలతో హాజరుకావాలని ఆదేశించారు. వేడుకలకు ముందు జిల్లావ్యాప్తంగా సూర్యనమస్కారాల నిర్వహణ, రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు, నగర వీధుల్లో శోభాయాత్ర వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని ముఖ్య కూడళ్లను విద్యుద్దీపాలతో అలంకరిస్తామన్నారు. పొరపాట్లకు తావులేకుండా వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో వేంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, అరసవల్లి ఆలయ ఈవో భద్రాజీ, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, డీపీఆర్వో చెన్నకేశవరావు, మునిసిపల్ ఇంజినీర్ సుగుణాకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్





యువత ఉన్నతికి..





గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి.. నైపుణ్యం గల వారిగా తీర్చి దిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీని కోసం 'ఉన్నతి' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకుండా ఇంటి వద్ద ఉంటున్న యువతలో నైపుణ్యాలను పెంచి.. ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. దీంతో అటు యువతకు ఉపాధితో పాటు... ఇటు అవసరానికి నైపుణ్యం గల వేతనదారులను తీర్చిదిద్దే అవకాశం కలగనుంది.

- 31 రంగాల్లో 215 కోర్సుల్లో నైపుణ్య శిక్షణ
- వంద పని దినాలు పూర్తయిన కుటుంబాల నుంచి ఎంపిక
- 90 రోజుల వేతన భృతితో అవకాశం
- నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగాలు

నరసన్నపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి):

ఉపాధి జాబ్ కార్డులతో వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న వేతనదారుల కుటుంబాల నుంచి ఆసక్తి ఉన్న 18 నుంచి 45 సంవత్సరాల వయసు గల యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్హతలతో సంబంధం లేకుండా వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తారు. పదో తరగతి పాస్, ఫెయిల్, డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి నైపుణ్యాలు పెంపొందించి.. ఉపాధి కల్పించడమే దీని లక్ష్యం. ఈ మేరకు ప్రభుత్వం 'ఉన్నతి' అనే కార్యక్రమం చేపడుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిలాలో 30 మండలాల్లో 4.32 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయి. వీరిలో 3.8 లక్షల మంది ఉపాధి వేతనదారులు పనులకు వినియోగించుకుంటున్నారు. గత ఏడాది వంద రోజుల పని దినాలు పూర్తయిన కుటుంబాలు 1.56 లక్షలు ఉన్నాయి. ఉపాధి హామీ సాంకేతిక సిబ్బంది, క్షేత్ర సహాయకులు చేపట్టిన సర్వేలో ఇప్పటి వరకు నైపుణ్య శిక్షణకు ఆసక్తి చూపించిన యువతీ యువకులు 30 మండలాల్లో 6,494 వేల మంది ఉన్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ యుగంధర్ తెలిపారు. గుర్తించిన వారంతా శిక్షణకు హాజరయ్యేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఆసక్తి కలిగిన వారందిరినీ సైరేడ్, సీ-డాప్ సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి సిబ్బంది కోరుతున్నారు.



90 రోజుల శిక్షణ..

ఎంపికైన వారికి వివిధ రంగాల్లో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. రోజుకు రూ.300 చొప్పున మూడు నెలలకు రూ.27వేలు వేతనం అందేలా చూస్తారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారు. శిక్షణా కాలం పూర్తయిన తరువాత అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తారు. సంబంధిత రంగాలకు చెందిన ప్రైవేటు సంస్థల్లో వారందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.

215 కోర్సుల్లో శిక్షణ..

విద్యార్హతతో సంబంధం లేకుండా ఆధునిక వ్యవసాయంలోని యంత్రాలు, డ్రోన్ల ఆపరేటింగ్, పవర్ స్ప్రేల వాడకం, వరి కోత మిషన్ ఆపరేటింగ్, మహిళలకు బ్యుటీషియన్, ఆధునిక మగ్గం వర్క్స్, టైలరింగ్, వెజిటబుల్ నర్సరీలు, తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్ తదితర 31 రంగాల్లో 215 కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తారు.



- కొనసాగుతున్న పోలీసు కానిస్టేబుళ్ల ఎంపిక
- 317 మంది మహిళా అభ్యర్థినుల హాజరు...118 మంది అర్హత

పరుగు పోటీలో పాల్గొన్న యువతులు

మేమూ సిద్ధమే!

ఎచ్చెర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసులుగా ధైర్య సాహసాలతో సేవలందించేందుకు తామూ సిద్ధమేనని యవతులు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. కానిస్టేబుల్ ఎంపికల్లో పాల్గొన్నారు. పోలీసు కానిస్టేబుల్ నియమాక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గత నెల 30న ఈ ప్రక్రియ ప్రారంభమైంది. శుక్ర, శనివారాల్లో మహిళా అభ్యర్థినులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన ఈ ప్రక్రియకు 587 మంది మహిళలు హాజరు కావలసి ఉండగా... 317 మంది హాజరయ్యారు. వీరిలో 118 మంది ఎంపికయ్యారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. తొలి మూడు రోజుల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 611 మంది పురుషులు, నాలుగో రోజు జరిగిన ప్రక్రియలో 118 మంది మహిళలు అర్హత సాధించారు.



శారీరక దారుఢ్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

నేస్తానికో నెయ్యి ముద్ద



- బంధాలకు చిహ్నంగా చెక్కీలు, ముద్దలు
- వీటితోనే శుభాకాంక్షలు ● సంప్రదాయానికి ప్రతీకలు ● ఉద్దానంలో విరివిగా వినియోగం

ప్రపంచమంతటికీ స్నేహితుల దినోత్సవం ఆగస్టు నెలలో వస్తుంది. కానీ ఆ ప్రాంతానికి డిసెంబరు, జనవరి నెలల్లో వస్తుంది. ఇంకా చెప్పాలంటే ఓ వైపు సంక్రాంతి పండగ.. మరోవైపు స్నేహితుల పండగ కలసి వస్తాయి. ఇది నిన్ననో... మొన్ననో వచ్చిన ఆచారం కాదు. తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం. ఈ స్నేహానికి చిహ్నాలుగా చెప్పుకునేవి నెయ్యి ముద్దలు... నెయ్యి చెక్కీలు. ఈ అందమైన సంప్రదాయానికి చిరునామా ఉద్దానం ప్రాంతం.

సోంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):

సాధారణంగా చూసే వారికి అవి నెయ్యి ముద్దలు... నెయ్యి చెక్కీలు. తీపి పదార్థాలు. కానీ వాటి వెనుక అందమైన బంధం ఉందన్న సంగతి తెలిసింది కొద్దిమందికే. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలతో పాటు ఉద్దానం అంతటా నెయ్యి చెక్కీలకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. నూతన సంవత్సరంలో సాధారణ పద్ధతిలో అనేకచోట్ల శుభాకాంక్షలు తెలుపుకుంటారు. కానీ ఉద్దానంలో నెయ్యి చెక్కీలు ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుకోవడం ఆనవాయితీ. 1936 ముందు వరకు గంజాం జిల్లాలో ఈ ప్రాంతం భాగం కాబట్టి ఆ సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతోంది.



నెయ్యి చెక్కీలను విక్రయిస్తున్న వ్యాపారి

ఎలా తయారు చేస్తారంటే..

కొత్త సంవత్సరంలో వరి పంట నూర్పులతో పాటే నెయ్యి ముద్దలు అందుబాటులోకి వస్తాయి. ధాన్యాన్ని వేయించి... వచ్చిన నెయ్యిలు (పేలాలు)తో ఈ ముద్దలు, చెక్కీలు తయారు చేస్తారు. జీడిపప్పు, బాదం పప్పు, నెయ్యిలో వేయించి.. ఒక పాత్రలో ఉంచుతారు. పంచదార పాకం చేసిన తరువాత అందులో నెయ్యిలు కలుపుతారు. బాగా కలిపిన తరువాత ఆ పాకాన్ని అచ్చుల్లో వేస్తారు. కొద్దిసేపటి తరువాత వాటిపైన కొబ్బరి పత్తీలు, జీడిపప్పు, బాదంపప్పు అతికిస్తారు. అప్పుడు చూడముచ్చటగా నెయ్యి ముద్దలు, చెక్కీలు తయారవుతాయి. వీటిని వివిధ డిజైన్లలో అందంగా రూపొందిస్తారు. ఇవి ఎంతో రుచికరంగా ఉంటాయి. వీటి తయారీకి పంచదార, బెల్లం వినియోగిస్తారు. కొందరు వీటి తయారీకి నేతిని వినియోగిస్తుంటారు.

నేస్తానికి గుర్తుగా...

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఎటువంటి రక్త సంబంధం లేని రెండు సామాజిక వర్గాలకు చెందిన ఇరు కుటుంబాల మధ్య స్నేహానికి గుర్తుగా నేస్తం (సోదరుడు), మొఖర (బావ) అనే వరుసలు ఏర్పరచుకుంటారు. కొందరు కొత్తగా ఈ వరుసలు ఏర్పరచుకుంటే... కొందరు తరతరాలుగా ఇలా బంధుత్వం కొనసాగిస్తుంటారు. ఇలాంటి కుటుంబాలు ఉద్దానం, సరిహద్దు ప్రాంతంలో వేలల్లో ఉంటాయి. ఈ కుటుంబాల మధ్య స్నేహానికి గుర్తుగా నెయ్యి ముద్దలు, చెక్కీలను పంచుకుంటారు. ఇది ముఖ్యంగా ధనుర్మాసంలో జరుగుతుంది. ఈ కాలంలో చేసే పూజల్లో మహిళలు దేవునికి నైవేద్యంగా వీటినే వినియోగిస్తారు. వీటిని మధుర (గుడియా) అనే సామాజికవర్గం వారు ఎక్కువగా తయారు చేస్తుంటారు. వీటి తయారీ కాస్త శ్రమతో కూడుకున్నదే. అందరికీ తీపిని పంచే గుడియా సామాజిక వర్గం వారి బతుకులు మాత్రం అంతంత మాత్రం గానే ఉన్నాయి.

ఒడిశాలో ప్రసిద్ధి..

నెయ్యి ముద్దలు, చెక్కీలకు ఒడిశాలోని బరంపురం పేరొందింది. అక్కడి నుంచే వివిధ ప్రాంతాలకు ఈ చెక్కీలను రవాణా చేస్తుంటారు. ఉద్దానం ప్రాంతంలో కొంతమంది తయారు చేస్తున్నప్పటికీ బరంపురంలో తయారైన వాటికే డిమాండ్ ఎక్కువ. నెయ్యి చెక్కీ పావు కిలో రూ.60 నుంచి దొరుకుతుంది. కిలో రూ.220 ఆపైన ఉంటుంది. బరంపురం నుంచి ఆంధ్ర, తెలంగాణ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు వీటిని ఎగుమతి చేస్తుంటారు.

అద్దె వదిలేశారు!

(ఐదో పేజీ తరువాయి)


నుంచి నెలకు రూ.7వేల నుంచి రూ.45వేల వరకు అద్దె వసూలు చేస్తుంటారు. దీని ద్వారా నెలకు కార్పొరేషన్‌కు రూ.4,76,653 ఆదాయం వస్తుంది. అంతవరకు బాగానే ఉంది. కానీ ఈ దుకాణాల అద్దె వసూలు కాక... కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతోంది.

● 14 దుకాణాలు...
రూ.40 లక్షల బకాయిలు


శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయానికి ఎదురుగా ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లోని 14 దుకాణాలకుగాను 2022 నుంచి అద్దె బకాయిలు పేరుకుపోయాయి. వీటి నుంచి నగర పాలక సంస్థ కార్యాలయానికి రూ.40,18,669 రావలసి ఉంది. వీటిలో కొన్ని దుకాణాలకు చెందినవారు 2022 నవంబరు నుంచి బకాయిలు చెల్లించలేదు. వీటిని వసూలు చేయాల్సిన బాధ్యతను సంబంధిత సచివాలయ సిబ్బందికి పూర్వపు కమిషనర్ అప్పగించారు. ఈ దుకాణాలకు నోటీసులు అందించి... కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది చేతులు దులిపేసుకున్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్ పి.వి.వి.ప్రసాదరావు కార్పొరేషన్ పరిధిలోని బకాయిలు చూసి అవాక్కయ్యారు. నగర పాలక సంస్థకు బకాయిలు చెల్లించకపోతే ఏం చేస్తున్నారంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా 2022లో టెండర్ల సమయంలో మంత్రి ధర్మాన ప్రసాద రావు అనుచరుడు ఈ షాపుల కేటాయింపులో చక్రం తిప్పారన్న విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి ఈ షాపుల కాల పరిమితి ముగుస్తుండటంతో బకాయిల వసూలు సాధ్యమేనా? అని నగర ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులు రూ.500 ఇంటి పన్ను చెల్లించకపోతే ఒత్తిడిపెట్టి.. వసూలు చేసే సచివాలయం, నగర పాలక సిబ్బంది.. వ్యాపారులు రూ.లక్షల్లో అద్దె బకాయిలు ఉన్నా చోద్యం చూడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ నగర పాలక సంస్థపై దృష్టి సారిస్తే తప్ప ఖజానా నిండేలా లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సంతబొమ్మాళి వైపు.. హల్దియా చూపు!

- మూడువేల ఎకరాల్లో పెట్రో కెమికల్స్‌కు సన్నాహాలు
- భారీ స్థాయిలో పెట్టుబడికి ప్రతిపాదనలు



పోర్టు పనులు చేస్తున్న దృశ్యం



టెక్కలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అత్యంత కీలకం కానుంది. ఇప్పటికే ఈ మండలంలో రూ.4,361.91 కోట్లతో 826 ఎకరాల్లో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. దీంతో మరికొన్ని ప్రధాన పరిశ్రమలు ఈ మండలం వైపు చూస్తున్నాయి. తాజాగా పోర్టుకు దగ్గరగా రూ.లక్షా 20 వేల కోట్లతో పరిశ్రమ స్థాపనకు కోల్‌కత్తాకు చెందిన హల్దియా పెట్రో కెమికల్స్ సంస్థ మూడువేల ఎకరాలు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ సంస్థ ద్వారా ఇక్కడికి తెప్పించే క్రూడాయిల్‌తో అవసరమయ్యే పెట్రో ఉత్పత్తులకు అనువైనవిగా ఈ సంస్థ గుర్తించింది. ఇప్పటికే ఏపీఐఐసీకి చెందిన 1,800 ఎకరాల స్థలం, ఈస్ట్‌కోస్ట్‌కు చెందిన 1,200 ఎకరాలు, సుమారు ఏడువేల ఎకరాల ఉప్పు భూములు, కొంతమేరకు అటవీ భూములు, జిరాయితీ భూములు, కోస్టల్ కారిడార్‌కు సంబంధించిన భూములు ఉండడంతో ఈ ప్రాంతం వైపే అందరి చూపు మళ్లింది. మరోవైపు ఈ ప్రాంతంలో హార్బర్ నిర్మాణానికి గాను నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ బృందం, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజనీరింగ్ ఫర్ ఫిషరీస్ అధికారుల బృందాలు కూడా 2024 అక్టోబరు నెలలో పర్యటించాయి.

పర్యాటకాభివృద్ధికి...

సంతబొమ్మాళి మండలంలోనే తీరప్రాంతంలో టూరిజం హబ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. గతంలో ఈ ప్రాంతంలో 800 ఎకరాల్లో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదన చేశారు. కానీ పక్కనే ఉన్న వజ్రపుకొత్తూరు మండలం వైపు మళ్లింది. అలాగే బీపీసీఎల్ రిఫైనరీకి ప్రతిపాదనలు చేసినప్పటికీ వారు దుగ్గిరాజుపట్నం వైపు మొగ్గు చూపారు. కానీ హల్దియా ఎలాగైనా మూడువేల ఎకరాల్లో నాఫ్తా పాలిమర్స్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. రోడ్డు, రైలు మార్గాలు అందుబాటులో ఉండడమే దీనికి కారణంగా తెలుస్తోంది. ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు సంబంధిత సంస్థలు కోరిన భూములు కేటాయింపునకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా జిరాయితీ, ఉప్పు భూములు ఈ ప్రాంతంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. సంతబొమ్మాళి మండలంలో హల్దియా పెట్రో కెమికల్స్ ప్రతిపాదన అంశమై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వద్ద ప్రస్తావించగా... ఈ విషయం వాస్తవమేనని తెలిపారు.



కొంగల దండు.. కదిలెను చూడు

రైతులు దుక్కి దున్ని... పంట కోసం ఆరాట పడుతుంటే... పక్షులు అదే పొలంలో ఆహారం కోసం ఆరాట పడుతున్నాయి. సంతబొమ్మాళి మండలం కోటపాడు పంచాయతీ సమీపంలో కోత మధు అనే రైతు రబీ వరి సాగుకు దమ్ము పడుతుండగా.. కొంగలు పొలాల్లో ఉండే పురుగులను ఆహారంగా తీసుకునేందుకు పోటీపడ్డాయి. ఒకేసారి వందల సంఖ్యలో కొంగలు ఇలా ఆహారాన్వేషణలో ఉండడంతో.. ప్రకృతి ప్రేమికులు తమ సెల్‌ఫోన్ కెమెరాలకు పని చెప్పారు.

-టెక్కలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి)

లగేజీ వ్యాన్ బోల్తా

● నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన వ్యాన్

బూర్జ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గోపీదేవిపేట వద్ద లగేజీ వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బూర్జమానుగూడ నుంచి అప్పలపేట గ్రామానికి కూలి పనులు కోసం కొంతమంది లగేజీ వ్యాన్‌లో వెళ్లారు. ఈ క్రమంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో సవర తేజేశ్వరరావు, సవర బోడెమ్మ, సవర చందు, బాలకృష్ణ గాయపడ్డారు. వారిని పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రవల్లిక తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

బూర్జ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఏడు ప్రభుత్వ మద్యం సీసాలను తీసుకువస్తున్న వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ ప్రవల్లిక తెలిపారు. శుక్రవారం లచ్చయ్యపేట గ్రామం వద్ద కొల్లివలస మద్యం దుకాణం నుంచి మద్యం సీసాలతో వస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీటీ కె.రాము తెలిపారు. టి.శాసనాం (ఓసీ మహిళ), పొత్రఖండ (బీసీ మహిళ), పాలవలస (ఎస్సీ), కర్తలిపాలెం (ఓసీ), బారువ-2 (ఓసీ వీడో/ఎక్స్‌సర్వీస్) పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోగా ఆర్డీవో కార్యాలయంలో అందించాలని కోరారు.

● కంచిలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ తెలిపారు. నువాగడ(ఎస్సీ) మఖరాంపురం (ఓసీ మహిళ), పద్మతుల (ఓసీ), జాడుపూడి (బీసీ-డీ) రేషన్ డిపోలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జనవరి 21వ తేదీలోగా దరఖాస్తులు పలాస ఆర్డీవో కార్యాలయానికి అందజేయాలని తెలిపారు.

● లావేరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా తొమ్మిది రేషన్ దుకాణాలు మంజూరైనట్టు తహసీల్దార్ వై.జోగారావు శుక్రవారం తెలిపారు. రావివలస, మురపాక, చిన్నయ్యపేట, గుంటుకుపేట, పాతరౌతుపేట, నక్కపేట, రామునిపాలెం, సేదురేపేట, శహపురం గ్రామాలకు రేషన్ దుకాణాలు మంజూరైట్టు తెలిపారు. కొత్తగా డీలర్లను నిమిస్తామన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈశ్వరరావు

ఎచ్చెర్ల: రణస్థలం ఎంపీడీవో ఈశ్వరరావును ఎచ్చెర్ల మండల ఇన్‌చార్జి ఎంపీడీవో (ఎఫ్ఏసీ) పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా ఉన్న హరిహరరావు సెలవుపై వెళ్లడంతో ఈశ్వరరావుకు ఈ బాధ్యతలు అప్పగించారు.

వివేకానందుడి బోధనలు స్ఫూర్తిదాయకం

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందుడి బోధనలు సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రామకృష్ణ మిషన్ (హైదరాబాదు) వారు ప్రచురించిన స్వామి వివేకానంద సాహిత్యం, వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ శ్రీకాకుళం సెంట్రల్ వ్యవస్థాపకుడు నటుకుల మోహన్, శారదా రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మందపల్లి రామకృష్ణారావు, విజయ్ సొసైటీ అధ్యక్షుడు రౌతు సుమతీమోహనరావులు పాల్గొన్నారు. అలాగే నూతన సంవత్సర రెవెన్యూ శాఖ డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, కలెక్టరేట్ అడ్మిన్ సూర్యనారాయణ, ఏపీజేఏసీ చైర్మన్ కె.శ్రీరాములు, మహిళా విభాగం చైర్మన్ ప్రవల్లిక ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

లావేరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటికే మంజూరైన పశువుల శాలల పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఏపీవో ఆర్.సత్యవతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షించ ఆరు. మండలంలోని ప్రతీ పంచాయతీలో కనీసంగా 20 పారం పాండ్స్ పనులను గుర్తించాలన్నారు. ఇంకుడు గుంతల పనులను పూర్తి చేయాలన్నారు. మండలంలో 2023-24 పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు జరుగనున్నాయని, వాటికి సంబంధించిన రికార్డులు సిద్ధం చేయాలని సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో పలువురు టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా విష్ణుమూర్తి



జి.సిగడాం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా మెట్టవలస గ్రామానికి చెందిన పైల విష్ణుమూర్తి ఎన్నికయ్యారు. రిటర్నింగ్ అధికారిగా దేవిరెడ్డి వీరబాబు వ్యవహరించారు. పూర్వ అధ్యక్షుడు వజ్జిపర్తి రఘురాం, ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, మండల బూత్ అధ్యక్షుడు, మండల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఎన్నికలో విష్ణుమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) రణస్థలంలోని తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని విష్ణుమూర్తి తెలిపారు.

బడిబయట పిల్లల గుర్తింపు

ఇచ్ఛాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బడిబయట పిల్లలను బడుల్లో చేర్పించాలని కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్రకుమార్ పట్నాయక్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో చదువుకొని మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థుల ఇళ్లకు పాఠశాల హెచ్ఎం స్వయంగా వెళ్లారు. విద్యార్థులకు, పేరెంట్స్‌కు చదువుపై ఆసక్తి కలిగించేలా అవగాహన కల్పించి తిరిగి పాఠశాలలో చేర్పించారు. చదువు మధ్యలోనే ఆపేసిన విద్యార్థులు మళ్లీ బడుల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందేలా చూసుకోవాలన్నారు.

సరుబుజ్జిలి ఎస్‌ఐగా హైమావతి



సరుబుజ్జిలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌ఐ బి.హైమావతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సోంపేట ఎస్‌ఐగా విధులు నిర్వహించి వీఆర్‌లో ఉన్న ఈమె సరుబుజ్జిలి ఎస్‌ఐగా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన బి.నిహార్‌ను వజ్రకొత్తూరు ఎస్‌ఐగా బదిలీ చేసిన తర్వాత సుమారు మూడు నెలల పాటు ఇక్కడ ఎస్‌ఐగా ఎవరినీ నియమించలేదు. సరుబుజ్జిలి, ఎల్ఎన్ పేట మండల పోలీస్ స్టేషన్‌గా ఉన్న ఈ స్టేషన్‌కు ఎస్‌ఐ నియమింకపోవడంతో టి.రాజేష్, ఎస్.బాలరాజు ఇంతవరకు ఇన్‌చార్జి ఎస్‌ఐలుగా విధులు నిర్వహించారు. సరుబుజ్జిలి ఎస్‌ఐగా హైమావతికి పూర్తి బాధ్యతలు అప్పగించడంతో ఎట్టకేలకు పూర్తిస్థాయి పోలీస్ అధికారి రావడం జరిగింది.

ఆమదాలవలస ఎస్‌ఐగా బాలరాజు



ఆమదాలవలస, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం సనపల బాలరాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన కె.వెంకటేష్ బదిలీపై వీఆర్‌కు వెళ్లారు. సరుబుజ్జిలి ఇన్‌చార్జి ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహించిన బాలరాజుకు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

సంగీత పోటీలకు శిరీష ఎంపిక

ఎచ్చెర్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సూర్నీడి శిరీష జాతీయ స్థాయి సంగీత పోటీలకు ఎంపికైంది. ఈ నెల 2న ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జానపద గీతాలు (సోలో) విభాగం సంగీతం పోటీల్లో పాల్గొన్న ఈమె ప్రథమ స్థానంలో నిలిచింది. క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో తదితరులు విద్యార్థినిని అభినందించారు.

విద్యకు పెద్దపీట

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

● ముగిసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గుజరాతీపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. విద్య కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫారాలు అందిస్తుందని గుర్తుచేశారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఏపీసీ శశిభూషణ్‌రావు, డిప్యూటీ డీఈవోలు ఆర్.విజయకు మారి, విలియమ్స్, జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సందర్శించి ప్రాజెక్టులను పరిశీలించారు.

విజేతలు వీరే..

వ్యక్తిగత విభాగంలో జస్వంత్ పాత్రో (జీహెచ్ఎస్, పలాస) ప్రథమ బహుమతి, పి.దీపక్‌కుమార్ (ఏపీఎంఎస్, పురుషోత్తపురం) ద్వితీయస్థానం సాధించారు. గ్రూప్ విభాగంలో అంపోలు దీపక్, ఎ.శివ హరీష్ (ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఎస్, సంతబొమ్మాళి)కు ప్రథమస్థానం, ఎ.దమయంతి, బి.శరణ్యశ్రీ (జడ్పీహెచ్ఎస్ ఎస్ఎస్ఆర్ పురం) ద్వితీయస్థానంలో నిలిచారు. అదే విధంగా ఉపాధ్యాయుల విభాగంలో బి.వెంకటరమణ (జడ్పీహెచ్ఎస్, మెట్టక్కివలస) ప్రథమస్థానం, కె.శ్యామసుందరరావు (ఈహెచ్ఎస్, శ్రీకాకుళం) ద్వితీయ స్థానంలో నిలిచారు.

అందరి భాగస్వామ్యంతో 'రథసప్తమి'

అరసవల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అందరి భాగస్వామ్యంతో రథసప్తమి పండగను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రథసప్తమి వేడుకల నిర్వహణపై వివిధ స్వచ్ఛంద సంస్థలు, భక్తుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రథసప్తమి వేడుకలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందని తెలిపారు. నగరంలోని ప్రజలంతా తమ కార్యాలయాలు, ఇళ్లను విద్యుత్ కాంతులతో అలంకరించుకోవాలన్నారు. రథసప్తమి వేడుకల నిర్వహణపై కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించామన్నారు. సామూహిక సూర్యనమస్కారాలు స్థానిక 80 అడుగుల రోడ్డులో ఫిబ్రవరి 2న ఉదయం 8 గంటలకు జరుగుతాయన్నారు. మున్సిపల్ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. లేజర్ షో, హెలీకాప్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా టూరిజం అధికారి కె.నారాయణరావు, ఆలయ ఈవో భద్రాజీ, కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి సౌకర్యాలు

సామాన్య భక్తులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. రథసప్తమి ఏర్పాట్లపై శుక్రవారం వారు ఆలయ పరిసరాలను, భౌగోళిక మ్యాప్‌ను పరిశీలించారు. ప్రధాన సింహద్వారం, దర్శన మార్గాలు, బారికేడ్లు, క్యూలైన్లు, ప్రవేశ ద్వారం, మండపం, ఇంద్రపుష్కరిణి, ఉచిత దర్శన మార్గాలు, ప్రసాదం కౌంటర్లు, కేశ ఖండనశాల సందర్శించారు. ఆలయ ఈవో భద్రాజీ, డీఎస్పీ వివేకానంద, సీఐలు, దేవదాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చైతన్య స్ఫూర్తి.. సావిత్రిభాయి పూలే

ఎచ్చెర్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్తగా సావిత్రిభాయి పూలే సమాజ చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచారని వక్తలు అభిప్రాయపడ్డారు. సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో శుక్రవారం ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, సీహెచ్ రాజశేఖరరావు, ఎస్‌వో కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: వర్సిటీలో నివాళులర్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: గాంధీ మందిరం వద్ద..

గాంధీ మందిరంలో..

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని శాంతినగర్‌లో గల గాంధీ మందిరంలో సావిత్రిభాయి పూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సురింగి మోహన్‌రావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు, జామి భీమశంకర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. అలాగే కలెక్టరేట్ సమీపం లో ఉన్న పూలే పార్కులో సావిత్రిభాయి పూలే జయంతి బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్య క్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బేగ్, ఉపాధ్యక్షుడు గుత్తు చిన్నారావు తదితరులు పాల్గొని నివాళర్పించారు.



కవిటి: ఉపాధ్యాయినుల అభినందించిన ఎమ్మెల్యే అశోక్

ఉపాధ్యాయినులకు సత్కారం

కవిటి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జగతి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పాల్గొని ఉపాధ్యాయినులను సత్కరించారు. ఉపాధ్యాయ సం ఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా జిల్లాలో వివిధ పాఠశాలల్లో పూలే జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

అన్ని రంగాల్లో ముందుండాలి: ఎమ్మెల్యే కూన



విద్యార్థులకు మిఠాయిలు అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చదువతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జ్యోతిరావుపూలే కస్తూర్బా పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతీరావుపూలే పాఠశాలలోని పదో తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులకు తెలుగు పద్యాలపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను పలు అంశాలపై ప్రశ్నలు వేసి.. పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరగా... పాఠశాల భవనం సరిపోక ఇబ్బందిపడుతున్నట్టు పలువురు విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఏడాదిలో ఈ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థినులకు మిఠాయిలు పంచిపెట్టారు. పాఠశాల మరుగుదొడ్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష పాఠశాల రహదారి అధ్వానంగా ఉందని, నూతన రహదారి నిర్మించాలని, పాలకొండ, శ్రీకాకుళం ప్రధాన రహదారిపై పాలకొండ, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులను పాఠశాల వద్ద నిలుపుదల చేయించాలని కోరారు. కార్య క్రమంలో కొర్లకోట ఎంపీటీసీ అన్నెపు బాస్కరరావు, జ్యోతిరావు పూలే స్కూల్ ప్రిన్సిపాల్ గరుగుబెల్లి వాసుదేవరావు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాక్‌డ్రిల్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రణస్థలం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు సూచించారు. స్థానిక ఏపీటోరియా పరిశ్రమ-4లో శుక్రవారం మిథనాల్ సాల్వెంట్ పైపులైన్ నుంచి చేపట్టవలసిన చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్‌డ్రిల్ ద్వారా నేర్చుకున్న అంశాలను తప్పకుండా పాటిస్తామని పరిశ్రమ మేనేజర్ మధన్‌కుమార్, భద్రతాధికారి సంపత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్, అడ్మిన్ అధికారి కమలాకర్‌రెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ టీమ్, జిల్లా అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేతగా రాపాక జట్టు



విజేతలతో ఎస్‌ఐ, నాయకులు

పొందూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా రాపాక గ్రామంలో స్నేహా యువకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో రాపాక జట్లు విజేతలుగా నిలిచాయి. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో రసవత్తరంగా సాగిన ఫైనల్ పోటీల్లో కబడ్డీలో రాపాక ప్రథమస్థానం, ఎస్ఎం పురం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ పోటీల్లోను రాపాక ప్రథమస్థానం, ఎస్ఎం పురం జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బహుమతి ప్రదానంలో పాల్గొన్న ఎస్‌ఐ వి.సత్యనారాయణ మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రీడాస్ఫూర్తిని నింపుతాయని, శరీర, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, టీడీపీ నాయకులు ఖండాపు శ్రీనివాసరావు, గ్రామస్థులు కొంచాడ గిరిబాబు, కె.సన్యాసి, శేషగిరి, జనసేన నాయకులు చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడతాం



కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 10నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడతామని ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రమేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని, లేకుంటే రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ యూనియన్ సభ్యులు రమేష్ పట్నాయక్, మాధవరావు, హరి, చిరంజీవి, ఉమ పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో సత్తాచాటిని జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి క్యాడెట్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. అండర్-17 విభాగంలో బాలుర కేటగిరిలో పి.సునీల్, కె.దుర్గాప్రసాద్, ఎస్.యశ్వంత్, బి.హర్ష నాలుగు కాంస్య పతకాలు సాధించారు. సైబర్ టీమ్ విభాగంలో పి.హర్షిత్, రామ్‌చరణ్, కె.హేమసుందర్, వి.రాజేష్ మూడు కాంస్య పతకాలు సాధించారు. బాలికల విభాగంలో డి.జోస్ని, రోషిత, దుర్గ భవాని, రాజేశ్వరి రజిత పతకాలు సాధించారు.

జాతీయ స్థాయి పోటీలకు కేశవరావుపేట విద్యార్థులు

ఎచ్చెర్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం బీవీ సాయిరాం తెలిపారు. మహారాష్ట్రలోని జలగాన్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొంటారన్నారు. కాకినాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న పూజారి హర్ష అభిరామ్, కొత్తకోట వసంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వీరిని హెచ్‌ఎంతోపాటు పీడీ ఎంవీ రమణ, పీఈటీ జి.మల్లేష్ తదితరులు అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి



గ్రామంలో నిర్వహించిన ర్యాలీ

గార, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రెల్ల జనార్దనరావు అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుడ్ టచ్ బాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీలో 'జలదౌతి'

ఎచ్చెర్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్-4, యోగా విభాగం ఆధ్వర్యంలో జలదౌతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. శీతాకాలంలో వచ్చే అనారోగ్య పరిస్థితులు, వీటికి దూరంగా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశంపై అవగాహన కల్పించారు. కరక్కాయ పొడి, వేప, తులసి ఆకులతో తయారుచేసిన జలదౌతి వినియోగం వల్ల ప్రయోజనాన్ని వివరించారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ, స్పోర్ట్స్ డీన్ రవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ముకుందరావు, యోగా విభాగాధిపతి జి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి రాక

సోంపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పలాసపురం గ్రామంలో శనివాం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరుకానున్నారు. బందోబస్తు నిమిత్తం సీఐ మంగరాజు పలాసపురం గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో చర్చించారు

గోదాదేవికి పూజలు

జి.సిగడాం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం పురష్కరించుకొని సంతవురిటి వేణుగోపాలస్వామి అలయంలో శుక్రవారం గోదావేవికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. వేకువజాము నుంచే మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటున్నారు. నెల రోజులు పాటు నిత్యపూజలు గోదాదేవి అందుకోనున్నట్టు అలయ కమిటీ సభ్యులు, ధర్మకర్త తెలిపారు.

బస్సుల్లో చలో విజయవాడ

ఇచ్ఛాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ విజయవాడలో ఈ నెల 5న నిర్వహిస్తున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు బయలుదేరే హిందూ పరిషత్ బంధువుల కార్యనిర్వహణకు ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించటం జరిగింది. అయితే అనివార్య కారణాల వల్ల రైలు ప్రయాణం రద్దు చేయడం జరిగింది. వాటి స్థానంలో కవిటి నుంచి తొమ్మిది బస్సులు వేయడం జరిగింది. అంతా గమనించి శనివారం సాయంత్రానికి కవిటి చేరుకోవాలని నిర్వాహకులు పాకతులసీదాస్‌రెడ్డి తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

అరసవిల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాను ప్రగతిపథంలో తీసుకువెళ్లడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయా పిలుపునిచ్చారు. జడ్పీ సమావేశ మందిరంలో 1, 2, 4, 5, 7 జిల్లా స్థాయీ సంఘ సమావేశాలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, బీసీ కార్పొరేషన్, వ్యవసాయశాఖ, ప్రణాళిక శాఖ, పట్టుపరిశ్రమ శాఖ, ఉద్యానవనశాఖ, అటవీశాఖ, గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, గృహనిర్మాణ సంస్థ, వైద్యారోగ్య తదితర శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆమదాలవలస, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ ప్రభుత్వ వెల్ఫేర్ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించి సమస్యలను పరిష్కరించాలని సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర సంచాలకులు బి.నీల వేణికి వినతిపత్రం అందించినట్టు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలోని ఆమె కార్యాలయంలో కలిసి సమస్యలు వివరించారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సంక్షేమ, విద్యా సహాయకులు వెల్ఫేర్ సెక్రటరీల ప్రధాన సమస్యలైన ప్రమోషన్ చానెల్ సర్వీస్ రూల్స్‌లో మార్పులు పెన్షన్ల పంపిణీలో కొన్ని జిల్లాల్లో ఉద్యోగులకు చిన్న చిన్న కారణాలతో షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్‌ల పరిష్కారం కోసం ఆమె దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్టు తెలిపారు. కార్య క్రమంలో సంఘ నాయకులు షేక్ అబ్దుల్‌రజాక్, వి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీలర్‌పై 6ఏ కేసు నమోదు

కంచిలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపురం రేషన్ డిపోలు శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్‌ఐ రామారావు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు సోదాలు నిర్వహించారు. రికార్డులకు మించి 179కిలోల బియ్యం, మూడు కిలోల పంచదార అధనంగా ఉన్నట్టు గుర్తించారు. సంబంధిత డీలర్ రాంబాబుపై 6ఏ కేసు నమెదు చేసినట్టు తెలిపారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజనం

ఇచ్ఛాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజన పథకాన్ని శనివారం నుంచి అమలు చేయనున్నట్టు బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

సారా తయారీ కేంద్రాలపై దాడులు

టెక్కలి/మెళియాపుట్టి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): టెక్కలి, మెళియాపుట్టి మండలాల పరిధిలో శుక్రవారం సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు సీఐ మీరాసాహెబ్ తెలిపారు. టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ సరియాపల్లి గ్రామం వద్ద పది లీటర్ల సారాతో ఒక వ్యక్తిని, మెళియాపుట్టి మండలం పెంగువాడ వద్ద 25 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మెళియాపుట్టి మండలం ఎగువ బగడ గ్రామంలో దాడులు చేసి 900 లీటర్ల పులిసిన బెల్లం ఊట, పది లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా సారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రతినిధులు ఎస్ఐ శ్రీనివాస్, సుజాత, మెళియాపుట్టి ఎస్ఐ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారన్నారు.

సారా విక్రయం కేసులో మహిళకు జైలుశిక్ష

పలాసరూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సారా విక్రయం కేసులో నేరం రుజువు కావడంతో పలాస మండలం పెదంచల గ్రామానికి చెందిన పైల డిల్లెమ్మకు 12 నెలల సాధారణ జైలుతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ పలాస న్యాయాధికారి యు.మాధురి శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు తెలిపారు. 2022లో14 లీటర్ల సారాను విక్రయిస్తుండగా అప్పటి ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణారావు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. ఈ మేరకు ఈ కేసులో శుక్రవారం తుది తీర్పు ఇచ్చారని, ఈ మేరకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ తెలిపారు.

గ్రామసభలో ఇరువర్గాల మధ్య తోపులాట

సంతబొమ్మాళి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నౌపడ గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జరిగిన గ్రామసభ లో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. గ్రామ అభివృద్ధి ప్రణాళిక కోసం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో నౌపడ-2 ఎంపీటీసీ సభ్యుడు బత్సుల సుధాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని అధికారులను ప్రశ్నించారు. దీంతో మాజీ ఎంపీటీసీ వాడరేవు కృష్ణారావు గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎవరికీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పనులు చేసుకున్నారని పేర్కొనడంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు, తోపులాట జరిగి గందరగోళం ఏర్పడింది. ఇక్కడ ఉన్న ఇతరులు ఇరువర్గాలను శాంతింపజేశారు. ఈ తోపులాటలపై ఎటువంటి ఫిర్యాదులు రాలేదని నౌపడ ఎస్ఐ నారాయణ స్వామి తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు సహకరించండి



అవగాహన కల్పిస్తున్న సీఐ తిరుపతిరావు

హరిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తిరుపతిరావు అన్నారు. సువర్ణాపురం హైస్కూల్‌లో శుక్రవారం 'సంకల్పం'లో భాగంగా విద్యార్థులకు అవగాహన కలిగించారు. డ్రగ్స్ గంజాయి, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శేఖర్, నీలకంఠం, డిల్లేశ్వరరావు, ఉపాధ్యాయుడు శంకరరావు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

పలాస, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి సందర్భంగా ఎవరైనా పేకాట, గుండాట, కోడిపందాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి సెలవులకు వెళ్లినప్పుడు ఇళ్ల తాళాలు సక్రమంగా వేసుకోవాలని, బంగారు ఆభరణాలు లాకర్‌లో పెట్టడం గాని, తమ వెంట తీసుకొని వెళ్లాలని ఇళ్ల యజమానులకు సూచించారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. గంజాయి, మత్తుపదార్థాల విక్రయం, రవాణాకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

జలుమూరు, జనవరి 3: (ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. తిలారు రైల్వేస్టేషన్, చల్లవానిపేట, కొమనాపల్లి కూడళ్లలో శుక్రవారం డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణా చేపట్టినా, విక్రయించినా సమాచారం అందించాలని కోరారు.

రీ సర్వే ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

నందిగాం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావు అన్నారు. రీసర్వే పైలెట్ ప్రొగ్రాం కింద మామిడిపల్లి ఎంపికవడంతో గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. సర్వే ప్రక్రియకు సంబంధించి రైతులు అవసరమైన వివరాలను సరిచేసుకోవచ్చన్నారు. నౌగాం సర్పంచ్ పి.సత్యం, గ్రామపెద్దలు వి.లక్ష్మణరావు, పి.ఈశ్వరరావు తదితరుల నేతృత్వంలో ఈ అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హనుమంతరావు, గ్రామ సర్వేయర్ యు.రామారావు పాల్గొన్నారు.

క్రీడాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం: బగ్గు

పోలాకి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శుక్రవారం మబగాం ఉన్నతపాఠశాలలో నియోజకవర్గ గ్రిగ్స్ బాల, బాలికల క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడాకారులంతా జాతీయ స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కొంతసేపు కబడ్డీ ఆడి విద్యార్థులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాధాకృష్ణ, స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టెక్కలికి అన్న క్యాంటీన్ మంజూరు



అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలమిదే..

టెక్కలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన టెక్కలికి అన్న క్యాంటీన్ మంజూరైంది. దీనికి అవసరమైన స్థలాన్ని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పట్టుమహాదేవి కోనేరు గట్టుపై మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో దాతల సహకారంతో రోజుకు 300 మందికి అన్న క్యాంటీన్ సేవలను అందిస్తున్నారు. అదే ప్రదేశంలో కొత్త అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. 2019లో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎదురుగా అన్న క్యాంటీన్ నిర్మాణానికి అప్పట్లో మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. పనులు జరుగుతుండగా ఎన్నికల కోడ్ రావడంతో అర్ధంతరంగా ఆ పనులు నిలిచి పోయాయి. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను ఎత్తివేసిన సంగతి తెలిసిందే. అయితే ఎన్నికల ముందు టీడీపీ నాయకులు సొంత నిధులతో అన్న క్యాంటీన్ సేవలను కొనసాగించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అన్న క్యాంటీన్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటుకు మంత్రి ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఓవర్ లోడ్‌తో దోపిడీ

- ఒక్కో లారీకి సుమారు 9 టన్నులు అదనంగా..
- మిల్లర్ల తీరుతో లారీ యజమానుల ఆవేదన



నరసన్నపేట వేర్ హౌసింగ్ గొడౌన్‌కు ఓవర్ లోడ్‌తో వచ్చిన లారీలు

నరసన్నపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మిల్లుల నుంచి ప్రభుత్వ గొడౌన్లకు బియ్యం చేరవేయడంలో మిల్లర్లు సిండికేట్ అయి ఓవర్ లోడ్‌తో తరలిస్తుండడంతో లారీ యజమానులు ఆవేదనకు గురవుతున్నారు. జిల్లాలో రైస్ మిల్లుల నుంచి ఫుడ్ కార్పొరేషన్, సివిల్ సప్లై గొడౌన్లకు బియ్యాన్ని సరఫరా చేస్తారు. ఈ రవాణాలో కొందరు మిల్లర్లు లారీ పరిమితికి మించి లోడింగ్ చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు 20 టన్నుల సామర్థ్యం ఉన్న లారీలో సుమారు 29 టన్నుల బరువు ఉన్న బియ్యం బస్తాలు వేసి 9 టన్నులు అదనంగా వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి 29 టన్నులకు ఆదాయం పొందుతూ లారీ యజమానులకు మాత్రం 20 టన్నులకే కిరాయి ఇస్తున్నారు. దీంతో ఒక్కో లారీ నుంచి మిల్లర్‌కు 9 టన్నులకు సంబంధించి మొత్తం అదనంగా వస్తోంది. ఒకవేళ రవాణా శాఖ అధికారుల తనిఖీలో ఓవర్ లోడ్‌తో చిక్కినా లారీ యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ విషయమై మిల్లర్లను ప్రశ్నించినా ఫలితం కనిపించడం లేదని లారీ యజమానులు చెబుతున్నారు. మిల్లర్ల చేతివాటంతో 30 టన్నుల సామర్థ్యం ఉన్న లారీలకు లోడింగ్ లేక మూలనపడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత సామర్థ్యం ఉన్న లారీకి అంతే సామర్థ్యం ఉన్న బియ్యం లోడ్ చేస్తామని చెప్పి లోడింగ్ సమయంలో అదనంగా వేస్తున్నారని, దీంతో పెద్ద లారీలకు లోడింగ్ లేకపోతోందని కొందరు లారీ యజమానులు 'ఆంధ్రజ్యోతి' వద్ద వాపోయారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనంలో ఇబ్బందులు లేకుండా చూడాలి

మెళియాపుట్టి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు అందించనున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. వంటలకు అవసరమైన వసతులు, నీటి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వంటలు రుచికరంగా ఉండాలని, వేడి పదార్థాలను విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్‌పండా, డీటీ రాము, ఎంఈవోలు మల్లారెడ్డి, పద్మనాభం, కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో జవాబుదారీగా ఉండాలి

పాతపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో జవాబుదారీగా వ్యవహరించాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో వచ్చే వినతులను పరిశీలించి సత్వరం పరిష్కారం చూపాలన్నారు. లబ్ధిదారు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ఎర్ర చెరువుపై వచ్చిన ఫిర్యాదులపై ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆక్రమణల స్థితిగతులపై రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. అనంతరం నాలాలను పరిశీలించి స్థానిక 266-2ఎలోని 95సెంట్ల విస్తీర్ణం, కొరసవాడలోని సర్వేనెంబర్ 255-8ఎలో 12 ఎకరాల విస్తీర్ణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, డివిజనల్ డిప్యూటీ సర్వేయర్ ఎం.జనార్దనరావు, సర్వేయర్ రామనాథం పాల్గొన్నారు.

ఎస్టీ మాకివలస భూముల పరిశీలన

జలుమూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మర్రివలస పంచాయతీ ఎస్టీ మాకివలస గ్రామాన్ని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష శుక్రవారం సందర్శించారు. గ్రామస్థుల ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామానికి సంబంధించిన వ్యవసాయ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయి. ఆ భూములు ఎవరు సాగు చేస్తున్నరే విషయాలపై ఆరా తీశారు. ఆ భూములపై ఎవరికి హక్కులున్నాయనే విషయమై రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జన్ని రామారావు, ఆర్ఐ కిరణ్, సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు పాల్గొన్నారు.





పాతపట్నం, మాకివలసల్లో క్షేత్రస్థాయిలో భూములను పరిశీలిస్తున్న టెక్కలి, శ్రీకాకుళం ఆర్డీవోలు కృష్ణమూర్తి, సాయి ప్రత్యూష

రోడ్ల అనుసంధానంతో గ్రామాలు అభివృద్ధి: ఎమ్మెల్యే బగ్గు



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రోడ్లను అనుసంధానం చేయడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం రూ.3.20 కోట్లతో చిన్నకరగాం-నర్సింగపల్లి, మబుగాం-కిల్లాం, రావులవలస-ఈదులవలస గ్రామాల రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం రోడ్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రావులవలసకి సరైన రోడ్డు లేక ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతున్నారని, మరలా కూటమి ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో రోడ్డు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. నరసన్నపేట నుంచి రావులవలసకి గ్యాస్ గొడౌన్ మీదుగా రోడ్డు ఏర్పాటుకు మరో రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, నేతలు పంగ బావాజీ నాయుడు, రువ్వ బోడి రామన్న, పి.సత్యనారాయణ, పల్లి శంకర్, గొద్దు చిట్టిబాబు, పోగోటి అప్పలనాయుడు పంచాయతీరాజ్ డీఈఈ సత్యంనాయుడు, ఏఈ నర్సింగరావు, రజనీకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం: ఎమ్మెల్యే శిరీష



కాశీబుగ్గ నర్సిపురం కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కాశీబుగ్గ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పట్టణం నర్సిపురం కాలనీలో రూ.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. 12వ వార్డు చాకలి చెరువు సమీపంలో ఉన్న దోబీ ఘాట్, పవర్ బోర్‌ను శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. చాకలి చెరువు సమీపంలో ఉన్న దోబీ ఘాట్‌కు రక్షణ గోడ, సామాజిక భవనం నిర్మాణం చేపడతామన్నారు. పవర్ బోరును బాగు చేసి తాగునీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు, టీడీపీ నేతలు లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, ఎస్.నవీన్, రవిశంకర్ గుప్తా, డీఈఈ కనకరాజు, ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

మండల సమావేశానికి అధికారుల గైర్హాజరు

- ఆగ్రహం వ్యక్తంచేసిన సభ్యులు



అధికారులను నిలదీస్తున్న సభ్యులు

టెక్కలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. మరికొన్ని శాఖల అధికారులు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అట్ల సరోజినమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గనులు, అటవీ, ఆర్టీసీ, వంశధార, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పరిశ్రమలు, మత్స్యశాఖ, వెనుకబడిన తరగతులు, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు హాజరు కాలేదు. విద్యుత్ శాఖ నుంచి ఏఈ రావాల్సి ఉండగా పట్టణానికి చెందిన లైన్‌మన్ హాజరు కావడంతో సభ్యులు వాకాడ శ్రీధర్‌రెడ్డి, బెండి దేవయాని తదితరులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తాము అడిగే ప్రశ్నలకు ఏం జవాబు చెబుతావని లైన్‌మన్‌ను ప్రశ్నించారు. గత సమావేశాల్లో గైర్హాజరైన అధికారులపై చర్యలకు సిఫార్సు చేసి ఉంటే ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని, మండలపరిషత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా అవుతోందని సభ్యులు రౌతు జయమోహన్, మొర్రి శంకర్ తదితరులు అసంతృప్తి వ్యక్తంచేశారు. జగతిమెట్ట ఇళ్ల కాలనీలో అక్రమాలు వెలికితీయాలని సభ్యులు డిమాండ్ చేశారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు కనీసం సమాచారం లేకుండా ఉపాధి హామీ పనులు క్షేత్రస్థాయిలో చేయిస్తున్నారని, ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని పలువురు సభ్యులు ప్రశ్నించారు. బూరగాం ఉపాధి పనులపై సభ్యులు లేవనెత్తిన అంశాన్ని పోలవరం సర్పంచ్ గురువెల్లి చిన్నమనాయుడు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా మండల పరిషత్ సమావేశంలో రచ్చ జరిగే అవకాశముందని గుర్తించి సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. సమావేశంలో జడ్పీటీసీ దువ్వాడ వాణి, ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ సమస్యతో నిలిచిన ఎక్స్‌ప్రెస్ రైలు



తిలారు రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన తీన్‌సుకా తంబూర్ ఎక్స్‌ప్రెస్ రైలు

జలుమూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిలారు రైల్వేగేటు మధ్యలో ఎక్స్‌ప్రెస్ రైలు సుమారు గంటపాటు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఆమదాలవలస నుంచి పలాస వైపు వెళుతున్న తీన్‌సుకా తంబూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 11 గంటలు సమయంలో సిగ్నల్ సమస్యతో తిలారు రైల్వే గేటు వద్ద, పలాస నుంచి ఆమదాలవలస వైపు వస్తున్న మెయిల్ ఎక్స్‌ప్రెస్ కూడా తిలారు స్టేషను వద్ద నిలిచిపోయాయి. రెండు రైళ్లకు సిగ్నల్స్ సమస్య వల్ల నిలిచిపోవడంతో గంటపాటు రైల్వే గేటువద్ద ఇరువైపులా భారీ వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. అయితే తిలారు రైల్వే గేటు వద్ద అండర్‌పాసేజీ ఉండడంతో చిన్నవాహనాలు దాని ద్వారా వెళ్లిపోయాయి. ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలు రైళ్లు వెళ్లేవరకు నిలిచిపోయాయి. దీంతో రైల్వే అధికారులు స్పందించి సిగ్నల్స్ సమస్యను పరిష్కరించి రెండు రైళ్లకు లైన్ క్లియర్ చేయడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

మండల వీఆర్వోల సంఘ కార్యవర్గం ఎన్నిక

కొత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండల వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గిరీష్‌కుమార్ పట్నాయక్, ఉపాధ్యక్షుడిగా బమ్మిడి కూర్మారావు, గౌరవాధ్యక్షుడిగా ఆర్.రాజగోపాలరావు, ప్రధాన కార్యదర్శిగా జి. విజయబాబు ఎన్నికయ్యారు. అలాగే సంయుక్త కార్యదర్శులుగా వి. నారాయణరావు, కె.ఉమారాణి, ఎం.గోవిందరావు, కోశాధికారిగా వి.బాలకృష్ణలతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్యసేవలు

నరసన్నపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనంలో జెమ్స్ ఆసుపత్రి వైద్యులు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది విశ్రాంత ఉద్యోగులకు వైద్యులు శివమణిసాయి, రేష్మ వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 10 మందికి వివిధ ఉన్నత వైద్యం కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పలాసకు నిధులు కేటాయించండి



ఎమ్మెల్సీ హరిప్రసాద్‌కు సమస్యలు విన్నవిస్తున్న దుర్గారావు

కాశీబుగ్గ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని జనసేన పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం జనసేన నాయకులతో కలిసి మంగళగిరిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. 2014-19లో ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన పూడిలంక వంతెన, రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఉద్దానం కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో తాగునీరందించాలని కోరారు. రక్షిత నీటి పథకం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. పలాసకు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక కార్యాలయం తరలించాలన్నారు. 200 పడకల కిడ్నీ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఆయుష్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జనసేన నేతలు హరీష్‌కుమార్, శ్రీకాంత్, కృష్ణారావు, వంశీకృష్ణ, మాశంకర్, విద్యాసాగర్, సునీల్‌వర్మ ఉన్నారు.

న్యూస్ బాక్స్

రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నరసన్నపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో 12 రేషన్ దుకాణాల డీలర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపోలవలస (జనరల్), పోతయ్యవలస (జనరల్ మహిళ), నరసన్నపేట వార్డు-4 (బీసీ-డి మహిళ) నరసన్నపేట వార్డు 7,8 (బీసీ-బి), నరసన్నపేట వార్డు-11బి (క్రీడాకారులు), నరసన్నపేట వార్డు 11-సి (బీసీ-బి), మడపాం (ఎస్సీ), శ్రీరాంపురం (జనరల్) అభ్యర్థులకు కేటాయించారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు కార్యాలయంలో సివిల్ సప్లై అధికారులను సంప్రదించాలని సూచించారు.

నేడు గోదాదేవికి సారె సమర్పణ

టెక్కలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవికి భక్తులు సారెను సమర్పించనున్నారని అర్చకులు సీహెచ్ రమణాచార్యులు తెలిపారు. జనవరి 13న గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నామని ఈవో వాకచర్ల రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

7, 8, 9 తేదీల్లో విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

టెక్కలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ ఈనెల 7, 8, 10 తేదీల్లో స్థానిక ఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఈఈ జి.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈఆర్‌సీ చైర్‌పర్సన్ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలను సేకరిస్తారన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరి

వజ్రపుకొత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బి.నిహార్ అన్నారు. శుక్రవారం బైపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల మండలంలో ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో యువకులు మృతి చెందుతున్నారని, దీనికి ప్రధానంగా హెల్మెట్ పెట్టుకోకపోవడమేనన్నారు. ఇకపై నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామ్‌జీ



టెక్కలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా జర్జాన రామ్‌జీని నియమిస్తూ జిల్లా నాయకులు ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ యువమోర్చా నాయకుడిగా వ్యవహరిస్తున్న రామ్‌జీ ఇక నుంచి పార్టీ మండల అధ్యక్షుడిగా పార్టీ పటిష్టానికి చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో సూచించారు.

మెటీరియల్ పంపిణీ

వజ్రపుకొత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గోవిందపురం హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న 41 మంది విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో పరీక్ష మెటీరియల్‌ను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని హెచ్ఎం హరిబాబు, చాపర కారువాడు, యూటీఎఫ్ నాయకులు కె.జయరాం, జి.శరత్, కె.సింహాచలం, చింత ఉమారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు

హరిపురం/మందస, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మందస ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గిరిజన గ్రామాలైన బలరాంపురం, బురుసాయి, గోపిటూరు, చాపరాయి, డలసరి, సవరమధ్య, సవరరాజపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో వసుంధరాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అర్హత కలిగి ఎస్టీ వర్గానికి చెందిన మహిళలు ఈనెల పదో తేదీలోగా మందస కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

'ఎత్తిపోతల'కు భూమిపూజ

కోటబొమ్మాళి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నిమ్మాడ ఎత్తిపోతల పథకం పునః నిర్మాణానికి పీఏసీఎస్‌మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఐడీసీ డీఈ మనిగామ కామరాజు, ఏఈ జి.మధుసూదనరావు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

పాతపట్నం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఏఎంసీ డీఈ ఈ దాసరి కోటయ్య అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో చేపడుతున్న నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. రైతులకు ఉపయోగపడేలా షెడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు.